సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
మంగళవారం । 17 । డిసెంబర్ । 2024



చీనీ టన్ను రూ.26,500
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.26,500, కనిష్టంగా రూ.15 వేల ప్రకారం ధర పలికాయి.




కిలో టమాట రూ.12
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్టంగా రూ.12, కనిష్టంగా రూ.6, సరాసరిన రూ.9 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
31.5°/12.1°
జిల్లాలో చలి వాతావరణం నెలకొంది. సోమవారం ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

వందనం.. మంగళం!





'ఈనెల సమ్మేటివ్ పరీక్షలు ఉంటాయి. ప్రతి ఒక్కరూ హాల్ టికెట్‌తో హాజరు కావాలి. అయితే 1, 2, 3వ టర్మ్ ఫీజులు కట్టిన వారికి మాత్రమే హాల్ టికెట్లు ఇస్తారు. నిర్ధీత గడువు లోపు ఫీజులు చెల్లించాలి. లేనిపక్షంలో పిల్లలను పరీక్షలకు హాజరు కానివ్వబోం. గమనించగలరు'
– హిందూపురంలోని ఓ ప్రైవేటు పాఠశాల నిర్వాహకులు వాట్సాప్ గ్రూపులో పంపించిన సందేశమిది.



ఈమె పేరు సౌజన్య. గుమ్మల్లకుంట గ్రామం, బత్తలపల్లి మండలం. భర్త ఈశ్వర్‌రెడ్డితో కలిసి వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. సౌజన్యకు ఇద్దరు పిల్లలు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి (7వ తరగతి), సుదీక్ష (4వ తరగతి) ఉన్నారు. ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అందరికీ 'తల్లికి వందనం' కింద ఆర్థిక సాయం చేస్తామని చంద్రబాబు ఎన్నికల సమయంలో చెప్పడంతో ఇద్దరు బిడ్డలను ప్రైవేటు స్కూల్లో చేర్పించింది. కానీ చంద్రబాబు అధికారంలోకి వచ్చి ఆరు నెలలు దాటినా పైసా సాయం అందించలేదు. మరోవైపు ఫీజుల కోసం పాఠశాల యాజమాన్యం ఒత్తిడి తెస్తుండటంతో సౌజన్య పడరాని పాట్లు పడుతోంది. జిల్లాలో ఇలాంటి వారు చాలా మందే ఉన్నారు.

- 'తల్లికి వందనం' ఊసే ఎత్తని బాబు
- టర్మ్ ఫీజుల కోసం స్కూళ్ల యాజమాన్యాల ఒత్తిడి
- వాట్సాప్‌లో మెసేజులు పంపుతున్న వైనం
- ఫీజు చెల్లించకపోతే పరీక్షలకు అనుమతించబోమని వెల్లడి
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు



సాక్షి, పుట్టపర్తి

'ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుతుంటే అందరికీ 'తల్లికి వందనం' అందిస్తాం. ఒకరు ఉంటే రూ.15 వేలు, ఇద్దరు ఉంటే రూ.30 వేలు, ముగ్గురు ఉంటే రూ.45 వేలు.. నేరుగా తల్లుల ఖాతాల్లో జమ చేస్తాం' అంటూ కూటమి నేతలు ఎన్నికల ముందు ప్రచారం ఊదరగొట్టారు. అయితే అధికారం చేపట్టి ఆరు నెలలు గడిచినా.. ఇప్పటికీ ఆ దిశగా అడుగులు వేయలేదు. కనీసం ఈ పథకం ప్రస్తావనే చేయడం లేదు. విద్యా సంవత్సరం ప్రారంభమై.. ఆర్నెల్లు కావడంతో ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు ఫీజుల కోసం తల్లిదండ్రులకు మెసేజ్‌లు పంపుతున్నారు. తరగతుల వారీగా ఏర్పాటు చేసుకున్న వాట్సాప్ గ్రూపుల్లో వార్నింగ్ ఇచ్చే విధంగా ఫీజులు డిమాండ్ చేస్తున్నారు. ఫీజు చెల్లించకపోతే ఎగ్జామ్ ఫీజు కూడా తీసుకునేది లేదని తేల్చి చెబుతున్నారు. ఫీజులు తీసుకురావాలని పిల్లలపై కూడా ఒత్తిడి చేస్తున్నారు.

ఆశలు ఆవిరి..
గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏటా ఠంచన్‌గా 'అమ్మ ఒడి' ద్వారా రూ.15 వేల చొప్పున విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలకు జమ చేసింది. ఆ పథకానికి ఆదరణ దక్కడంతో ఎన్నికల ముందు చంద్రబాబు కూడా తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇంట్లో ఎందరు ఉంటే అందరికీ తల్లికి వందనం పేరుతో రూ.15 వేలు చొప్పున ఇస్తామని హామీ ఇచ్చారు. ఇద్దరు అంతకంటే ఎక్కువ మంది పిల్లలున్న తల్లిదండ్రులు ఆయన మాటలు నమ్మి ఓట్లు వేశారు. అయితే కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఆరు నెలలు గడిచినా.. ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన లేకపోవడంతో ఫీజులు కట్టలేక పేదలు అవస్థలు పడుతున్నారు.

గత ప్రభుత్వంలో జిల్లాకు రూ.946 కోట్లు..
పేద పిల్లలు ఉన్నత చదువులు చదవాలన్న లక్ష్యంతో దేశంలోనే తొలిసారిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 'అమ్మ ఒడి' పథకానికి శ్రీకారం చుట్టింది. ఏటా రూ.15 వేల చొప్పున ఆర్థిక సాయం అందించింది. ఇలా నాలుగు విడతల్లో జిల్లాలోని తల్లుల ఖాతాల్లో రూ.946 కోట్లు జమ చేసింది. ఈ లెక్కన ఏటా సగటున 1.50 లక్షల మంది లబ్ధి పొందే వారు. దీంతో పథకం విజయవంతమై డ్రాపౌట్స్ సంఖ్య భారీగా తగ్గింది. కానీ ఇప్పుడు ఫీజులు చెల్లించలేని స్థితిలో చాలా మంది తమ పిల్లలను చదువులు మాన్పిస్తున్నారు.

2,508 జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు

2.27 లక్షలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులు

రూ.340.50 కోట్లు ఏటా జిల్లాలోని తల్లుల ఖాతాల్లో జమ కావాల్సిన మొత్తం

రూ.0 ఇప్పటివరకూ మంజూరు చేసిన మొత్తం

హామీవల్లే ప్రైవేటులో చేర్చా



చంద్రబాబు ఇచ్చిన 'తల్లికి వందనం' హామీ నమ్మి నా ఇద్దరు పిల్లలను ప్రైవేటు పాఠశాలలో చేర్పించా. ఇంట్లో ఎంత మంది పిల్లలున్నా అందరికీ రూ.15 వేల చొప్పున ఇస్తామంటే ఎంతో ఆశ పడ్డాను. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు దాటుతున్నా ఆ పథకం గురించి ఎవరూ చెప్పడం లేదు. పాఠశాల వాళ్లు మాత్రం ఫీజులు కట్టాలని ఒత్తిడి చేస్తున్నారు. ఇద్దరు పిల్లలకు ఫీజులు చెల్లించాలంటే మాలాంటి మధ్యతరగతి వారికి కష్టమే.
– సి.స్వాతి, ఎస్.సడ్లపల్లి, హిందూపురం

ఫీజులు కట్టలేకున్నాం



నాకు ఇద్దరు పిల్లలు. నల్లచెరువులోని ఓ ప్రైవేట్ పాఠశాలలో అమ్మాయి యశస్విని 4వ తరగతి, కుమారుడు సాత్విక్ 1వ తరగతి చదువుతున్నారు. తల్లికి వందనం పథకం ద్వారా ఎంతమంది పిల్లలుంటే అంతమందికి రూ.15 వేల చొప్పున ఇస్తామని చంద్రబాబు చెప్పారు. స్కూళ్లు తెరచి నెలలు గడుస్తున్నా... ప్రభుత్వం నుంచి రూపాయి కూడా అందలేదు. పిల్లల ఫీజులు చెల్లించడానికి ఇబ్బందులు పడుతున్నాం.
– భార్గవి, నల్లచెరువు మండలం

ఫీజుల కోసం వేధిస్తే చర్యలు



ఫీజుల కోసం వేధించే పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఈ మేరకు ఇప్పటికే పాఠశాలల యాజమాన్యాలకు తెలిపాం. అయినా ఫీజులు చెల్లించలేదన్న కారణంతో హాల్ టికెట్లు ఇవ్వకపోవడం, సమ్మేటివ్ పరీక్షలకు హాజరు కాకుండా అడ్డుకోవటం లాంటి చర్యలకు దిగితే అలాంటి పాఠశాలలపై కఠినంగా వ్యవహరిస్తాం. ఏ పాఠశాల యాజమాన్యమైనా ఫీజుల కోసం వేధిస్తే మా దృష్టికి తీసుకురావాలి.
– కిష్టప్ప, జిల్లా విద్యాశాఖ అధికారి

న్యూస్‌రీల్

కల్తీ కల్లు అమ్మితే పీడీ యాక్ట్



మద్యం దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న సీఐ, సిబ్బంది

హిందూపురం అర్బన్: కల్తీ కల్లు విక్రయిస్తే పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని హిందూపురం ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య హెచ్చరించారు. సోమవారం ఆయన సిబ్బందితో కలిసి లేపాక్షి, చిలమత్తూరు మండల పరిధిలోని కల్లు దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. పలు దుకాణాల్లోని కల్లు నమూనాలు సేకరించారు. వీటిని చిత్తూరులోని ల్యాబ్‌కు పంపుతామని, మత్తు పదార్థాలు కలిపినట్లు తేలితే లైసెన్స్ రద్దుతో పాటు, ఆయా దుకాణదారులపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామన్నారు.

ఎంఆర్‌పీకే మద్యం విక్రయించాలి..
ప్రభుత్వం నిర్ణయించిన ఎంఆర్‌పీకే మద్యం అమ్మకాలు చేయాలని ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య మద్యం దుకాణాల నిర్వాహకులను ఆదేశించారు. సోమవారం ఆయన హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరులోని పలు మద్యం దుకాణాలను తనిఖీ చేశారు. ఎంఆర్‌పీకి మంచి మద్యం విక్రయాలు చేపట్టినా, బెల్టు దుకాణాలకు మద్యం సరఫరా చేసినా.. కఠినంగా వ్యవహరిస్తామన్నారు. తొలిసారి కేసు నమోదైతే రూ.5 లక్షలు జరిమానా విధిస్తామన్నారు. రెండోసారి కూడా కేసు నమోదైతే లైసెన్స్ రద్దు చేస్తామన్నారు.

కాళ్లు పట్టుకుంటాం.. కనికరించండి

- మా ఉద్యోగాలు మళ్లీ మాకు ఇప్పించండి
- మంత్రి సవిత వద్ద కన్నీటిపర్యంతమైన ఎంపీహెచ్‌ఏలు



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎంపీహెచ్‌ఏలు

పెనుకొండ: "ఏళ్లుగా ఈ ఉద్యోగాన్నే నమ్ముకుని బతుకుతున్నాం. మాలో చాలా మందికి 50 ఏళ్లు కూడా దాటాయి. ఇప్పుడు ఉన్నట్టుండి మమ్మల్ని ఉద్యోగాల నుంచి తీసేశారు. మా కుటుంబాలు రోడ్డున పడ్డాయి. మీ కాళ్లు పట్టుకుంటాం...కనికరించండి. మా ఉద్యోగాలు మాకు ఇప్పించండి" అని పలువురు మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్లు (మేల్) మంత్రి సవిత ప్రాధేయపడ్డారు. సోమవారం మంత్రి సవితను క్యాంప్ కార్యాలయంలో అబ్దుల్ అజీజ్‌ఖాన్, మురళి, శ్రీనివాసులు, రవి తదితర ఎంపీహెచ్‌ఏ (మేల్)లు కలిశారు. 2002లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చి నిబంధనల మేరకు రాత పరీక్ష నిర్వహించి తమను నియమించిందన్నారు. ప్రస్తుతం తెలంగాణ హైకోర్టు తీర్పును సాకుగా చూపి ప్రభుత్వం తమను తొలగించిందని వాపోయారు. తమపైనే ఆధారపడిన వృద్ధులైన తల్లిదండ్రులు, పెళ్లీడుకొచ్చిన బిడ్డలను చూసి మానవతా దృక్పథంతో తమకు మళ్లీ ఉద్యోగాలు కల్పించాలని మంత్రిని వేడుకున్నారు.

ఇంధన పొదుపు సామాజిక బాధ్యత



ఇంధన పొదుపు అవగాహన వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

- కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: ఇంధన పొదుపును సమాజంలోని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అన్నారు. ఈనెల 14 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్న ఇంధన పొదుపు అవగాహన వారోత్సవాల సందర్భంగా ఏపీఎస్పీడీసీఎల్ రూపొందించిన పోస్టర్లు, ఫ్లెక్సీలు, కరపత్రాలను సోమవారం ఆయన కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలు దైనందిన జీవితంలో ఇంధన పరిరక్షణపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. విద్యుత్‌ను అవసరం మేరకే వాడాలన్నారు. కరెంటు వాటర్ హీటర్లు, గీజర్లకు బదులు సోలార్ పరికరాలు వాడాలన్నారు. ప్రతి ఒక్కరూ ఫైవ్‌స్టార్ రేటింగ్ ఉన్న గృహోపకరణాలు, ఎల్‌ఈడీ బల్బులు వాడాలన్నారు. దీన్ని వల్ల 30 శాతం విద్యుత్ ఆదా అవుతుందని, తద్వారా కాలుష్యాన్ని కూడా నివారించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ కరెంట్‌ను ఆదా చేసి భావితరాలకు భరోసా కల్పించాలన్నారు. ముఖ్యంగా కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న 'సూర్యఘర్' లాంటి పథకాలు సద్వినియోగం చేసుకుంటే ఇంధనాన్ని బాగా చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ విజయసారథి, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ సురేంద్రబాబు, ఈఈ శివరాం, ఏఈ సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఒక్క అర్జీ పెండింగ్‌లో ఉండకూడదు

- ప్రజా సమస్యలన్నీ సకాలంలో పరిష్కరించాలి
- అధికారులకు కలెక్టర్ చేతన్ ఆదేశం



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, ప్రజల నుంచి అందే అర్జీల్లో ఒక్కటి కూడా పెండింగ్‌లో ఉంచకుండా సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పింఛన్లు, ఇంటి స్థలాలు, ఇల్లు, భూ సమస్యలు తదితర అంశాలపై ప్రజలు మొత్తంగా 210 అర్జీలు ఇచ్చారు. కార్యక్రమం అనంతరం కలెక్టర్ చేతన్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామ, మండల స్థాయిలోనూ 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నా...అక్కడ అర్జీలకు పరిష్కారం దొరకడం లేదన్నారు. అందువల్లే జిల్లా నలుమూలల నుంచి ప్రజలు కలెక్టరేట్ వరకూ వస్తున్నారన్నారు. ఇక నుంచి అలా జరగడానికి వీల్లేదన్నారు. సమస్యకు స్థానికంగానే పరిష్కారం చూపే విధంగా అధికారులు పనిచేయాలన్నారు. ప్రతి అర్జీకి నాణ్యమైన పరిష్కారం చూపించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రభుత్వశాఖల అధికారులు కింది స్థాయి సిబ్బంది పనితీరును ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని, ఎవరైనా విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే వెంటనే వారి పనితీరు మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఆర్‌ఓ విజయసారథి, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, ఎస్‌డీసీ సూర్యనారాయణరెడ్డి, సీపీఓ విజయ్‌కుమార్, వ్యవసాయ శాఖ అధికారి వైపీ సుబ్బారావు, ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగ ప్రసాద్, పట్టు పరిశ్రమ శాఖ అధికారి పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

సూక్ష్మ, చిన్న పరిశ్రమలకు ప్రాధాన్యత

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్



మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

పెనుకొండ: రాష్ట్రంలో సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు అధిక ప్రాధాన్యం ఇస్తామని ఎంఎస్‌ఎంఈ, సెర్ప్, ఎన్నారై సాధికార సంక్షేమ సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆయన జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా పెనుకొండలోని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత క్యాంపు కార్యాలయంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎంఎస్‌ఎంఈల ఏర్పాటుపై అధికారులతో సమీక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు. డ్వాక్రా సంఘాల ద్వారా వ్యాపారాల నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందిస్తున్నామన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడానికి కృషి చేస్తున్నామన్నారు. మంత్రి సవిత మాట్లాడుతూ రాయలసీమను పరిశ్రమల హబ్‌గా మారుస్తామన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్న లక్ష్యంతో ఉన్నామన్నారు. రుణాలు అందజేసి స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటుకు చేయూతనిస్తామన్నారు.

పాదస్పర్శతో పరమానందం



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

ఎక్కడెక్కడి నుంచో తరలివచ్చిన జనం.. ఒక్కొక్కరిదీ ఒక్కో కోర్కె. భూతప్ప పాదస్పర్శ తగిలితే చాలు కష్టాలు పటాపంచలవుతాయన్న నమ్మకం. అందుకే భక్తితో మడిస్నానమాచరించి నడిరోడ్డుపై పడుకున్నారు. భూతప్ప కాలిస్పర్శ తగలగానే పరమానంద పడ్డారు.

- ఘనంగా లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు
- ఆకట్టుకున్న భూతప్పల ఉత్సవం
- జనసంద్రమైన భక్తరపల్లి



భూతప్పలు వచ్చే దారిలో పడుకున్న భక్తులు



మహిళలను తొక్కుకుంటూ వస్తున్న భూతప్పలు



ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా తీసుకువస్తున్న దృశ్యం

మడకశిర రూరల్: చదువుకున్న వారు..నిర్లక్ష్యరాస్యులు..శ్రీమంతులు.. కూలిపని చేసుకుని జీవనం సాగించే బడుగు జీవులు..అందరిదీ ఒకటే కోర్కె. భూతప్ప పాదస్పర్శ తగిలే చాలన్నది సంకల్పం. అచంచలమైన భక్తి విశ్వాసంతో నడిరోడ్డుపై బోర్లా పడుకున్నారు. తనువంతా కనులుగా చేసుకుని భూతప్పల కోసం ఎదురుచూశారు. పాదస్పర్శతో పునీతులైనట్లుగా భావించి సంబరంగా వెళ్లిపోయారు. ఈ అపూర్వ దృశ్యం సోమవారం మడకశిర మండలంలోని భక్తరపల్లిలో కనిపించింది.

ఆకట్టుకున్న ఉత్సవం..
రాష్ట్రంలోని ప్రసిద్ధిగాంచిన భక్తరపల్లి లక్ష్మీనరసింహస్వామి, జిల్లేడుగుంట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం భూతప్ప, జ్యోతులు ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు తదితర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరాగా భక్తరపల్లి జనసంద్రమైంది. తొలుత స్వామివారికి పూజలు చేసిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భూతప్పల ఉత్సవంలో భాగంగా పాదస్పర్శ కోసం కింద పడుకున్నారు. భూతప్పలు తమపైనుంచి నడుచుకుంటూ వెళ్లగానే భక్తిభావంతో దండం పెట్టి అక్కడి నుంచి బయలుదేరి వెళ్లారు. అనంతరం నిర్వహించిన జ్యోతుల ఉత్సవం ఎంతగానో ఆకట్టుకుంది. తెల్లవారుజాము నుంచే మహిళలు భక్తిశ్రద్ధలతో జ్యోతులను మోసుకుంటూ భక్తరపల్లి, జిల్లేడుగుంట ఆలయాలకు చేరుకుని స్వామి వార్లకు సమర్పించారు. దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కుబడి మేరకు వేరుశనగ కాయలు, కొబ్బరికాయలు, అరటిపండ్లు, చిరుధాన్యాలను గోపురంపైకి విసిరారు.



స్వామివార్లకు జ్యోతులు తీసుకువస్తున్న భక్తులు

ఆకట్టుకున్న పొంజు ఉత్సవం..
బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన పొంజు ఉత్సవం కూడా భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. పొంజుతో తలపై కొట్టించుకుంటే కష్టాలు తీరుతాయన్నది భక్తుల నమ్మకం. దీంతో పొంజుతో తలలపై కొట్టించుకోవడానికి భక్తులు ఎగబడ్డారు. అలాపొంజుతో కొట్టిన వారికి కానుకలు అందజేశారు. బ్రహ్మోత్సవాల కోసం ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను నడిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సీఐ రాగిరిరామయ్య బందోబస్తును ఏర్పాటు చేశారు. దేవదాయశాఖ అధికారులు, రథోత్సవం కమిటీ సభ్యులు బ్రహ్మోత్సవాలను పర్యవేక్షించారు. దాతలు, ఆలయ కమిటి సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు.

సంప్రదాయం అద్భుతం..
ఇక్కడి సంప్రదాయం అద్భుతంగా ఉందని ఇటలీకి చెందిన హేరిక దంపతులు తెలిపారు. సోమవారం వారు లక్ష్మీనరసింహస్వామి, ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. తమకు హిందూసంప్రదాయమంటే ఎంతో మక్కువ అని తెలిపారు. భూతప్పల ఉత్సవం ఎంతో ఆకట్టుకుందని తెలిపారు.

క్లుప్తంగా

డెంగీతో చిన్నారి మృతి


లిఖిత (ఫైల్)

కళ్యాణదుర్గం: డెంగీ జ్వరంతో బాధపడుతూ ఓ బాలిక మృతి చెందింది. వివరాలు.. కళ్యాణదుర్గంలో నివాసముంటున్న శ్రావణ్ కుమార్తె లిఖిత (8) 45 రోజుల క్రితం జ్వరం బారిన పడింది. ఈ క్రమంలో తల్లిదండ్రులు చికిత్స చేయిస్తూ వచ్చారు. నయం కాకపోవడంతో ఆస్పత్రులు మారుతూ వచ్చారు. అయినా ఫలితం లేకపోవడంతో కొన్ని రోజుల క్రితం బెంగళూరులోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్పించారు. పరీక్షించిన వైద్యులు బాలిక డెంగీతో బాధపడుతున్నట్లు నిర్ధారించి, చికిత్స మొదలు పెట్టారు. ఈ క్రమంలో జ్వర తీవ్రత పెరిగి బ్రెయిన్‌కు సోకడంతో నరాలు బలహీనమయ్యాయి. దీంతో శస్త్రచికిత్స చేయాల్సి ఉందని, దీనికి రూ.10 లక్షల వరకూ ఖర్చు వస్తుందని అక్కడి వైద్యులు తెలిపారు. అంత పెత్త మొత్తాన్ని సమకూర్చుకోలేక ఇబ్బంది పడిన శ్రావణ్... ఇటీవల నేమకల్లు పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబును కలసి చిన్నారి పరిస్థితి వివరించి, ఆర్థిక సాయం చేయాలని అభ్యర్థించారు. ఈ లోపు బాలిక పరిస్థితి విషమించి సోమవారం ఉదయం మృతి చెందింది.

రైలు ఢీకొని మహిళ మృతి


గుర్తు తెలియని మహిళ మృతదేహం

హిందూపురం అర్బన్: ప్రమాదవశాత్తు రైలు ఢీకొని ఓ గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. దాదాపు 40 ఏళ్ల వయసున్న మహిళ హిందూపురం రైల్వే స్టేషన్ సమీపంలో సోమవారం ఉదయం పట్టాలు దాటుతుండగా బెంగళూరు నుంచి పెనుకొండ వైపుగా వెళుతున్న రైలు ఢీకొన్నట్లుగా సమాచారం. మృతురాలి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. ఆచూకీ తెలిసిన వారు 93988 99299, 89195 50400 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని జీఆర్పీ ఎస్ఐ బాలాజీ నాయక్ కోరారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.

ఆటో బోల్తా - వ్యక్తి మృతి


మృతుడు ముత్యాలు

చెన్నేకొత్తపల్లి: ఆటో బోల్తాపడిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... సీకే పల్లి మండలం న్యామద్దెల గ్రామానికి చెందిన ముత్యాలు (45) సోమవారం ఉదయం తన సొంత పనిపై భార్య రమాదేవి, కుమార్తె లాస్యలతతో కలసి ధర్మవరం వెళ్లాడు. అక్కడ పని ముగించుకున్న అనంతరం ఆటోలో తిరుగు ప్రయాణమయ్యారు. సీకే పల్లి మండలం దామాజిపల్లి వద్దకు చేరుకోగానే రోడ్డుకు అడ్డంగా వచ్చిన కుక్కను డ్రైవర్ తప్పించబోగా ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. గాయపడిన ముత్యాలుతో పాటు మిగిలిన ఇద్దరినీ స్థానికులు ప్రైవేటు వాహనంలో చెన్నేకొత్తపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ముత్యాలు మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

హత్య కేసులో వీడిన మిస్టరీ

- ఈ నెల 12న విద్యుత్ కాంట్రాక్టర్ రాజశేఖర్ హత్య
- వివాహేతర సంబంధమే కారణం
- ఆరుగురి అరెస్ట్
- కర్రలు, ఇనుపరాడ్లు, స్విఫ్ట్ కారు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ విజయకుమార్


కేసు వివరాలు వెల్లడించి ముద్దాయిలను చూపుతున్న డీఎస్పీ విజయకుమార్, సీఐ ఇందిర

పుట్టపర్తి టౌన్: ఈ నెల 12న కొత్తచెరువులో చోటు చేసుకున్న విద్యుత్ కాంట్రాక్టర్ రాజశేఖర్ (49) హత్య కేసులో మిస్టరీని పోలీసులు ఛేదించారు. వివాహేతర సంబంధమే కారణంగా నిర్ధారించి అరుగురు నిందితులను అరెస్ట్ చేశారు. స్థానిక తన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను డీఎస్పీ విజయ్‌కుమార్ వెల్లడించారు. ఈ నెల 12న కొత్తచెరువులోని మైలేపల్లి చెరువు కట్ట వద్ద ఉన్న విజయ్‌కుమార్ ఫాం హౌస్‌లో నల్లమాడ మండలం బొగ్గులపల్లికి చెందిన విద్యుత్ కాంట్రాక్టర్ గాండ్ల రాజశేఖర్‌కు హత్యకు గురైన విషయం తెలిసిందే. హతుడి భార్య స్వర్ణలత ఫిర్యాదు మేరకు కొత్తచెరువు సీఐ ఇందిర కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో విస్తుబోయే అంశాలు వెలుగు చూశాయి.

టిఫిన్ కోసం వెళుతూ..

పెనుకొండ మండలం వెంటకగిరిపాలెం గ్రామానికి చెందిన రాధిక నిర్వహిస్తూ జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో ఆ ప్రాంతంలో విద్యుత్ కాంట్రాక్ట పనులు చేపట్టిన రాజశేఖర్ కూలీల కోసం హోటల్‌కు తరచూ టిఫిన్, భోజనానికి వెళ్లేవాడు. దీంతో రాధికతో ఏర్పడిన పరిచయం కాస్త వివాహేతర సంబంధానికి దారి తీసింది. విషయం తెలుసుకున్న భర్త రవీంద్రారెడ్డి, రాధిక తమ్ముడు సాయినాథ కుమార్ రెడ్డి (కానిస్టేబుల్) ఇద్దరూ దండించారు. అయినా రాజశేఖర్‌లో మార్పు రాలేదు. దీంతో పెద్ద మనుషుల పంచాయితీలు నిర్వహించారు. పలుమార్లు హెచ్చరించారు. అయిన ప్రవర్తన మారకపోవడంతో తమ కుటుంబ పరువు మర్యాదలను కాపాడుకోవాలని నిర్ణయించుకున్న రవీంద్రారెడ్డి, సాయినాథరెడ్డి ఎలాగైనా రాజశేఖర్‌ను అంతమొందించాలనుకున్నారు.

పథకం ప్రకారం..

రాజశేఖర్‌ను హతమార్చాలని నిర్ణయించుకున్న అనంతరం తన సమీప బంధువు సోమందేపల్లికి చెందిన అనిల్‌కుమార్‌రెడ్డి, ఆయన స్నేహితులు వెంకటేష్, నరేష్ సాయాన్ని సాయినాథరెడ్డి తీసుకున్నాడు. ఈ నెల 12న రాత్రి విజయకుమార్ ఫాం హౌస్‌లో రాజశేఖర్ ఉన్నట్లుగా పసిగట్టిన సాయినాథరెడ్డి, రవీంద్రారెడ్డి వెంటనే అనిల్‌కుమార్‌రెడ్డి, వెంకటేష్, నరేష్‌ను పిలుచుకుని స్విఫ్ట్ కారులో ఫాం హౌస్‌కు చేరుకున్నారు. ఆ సమయంలో చుట్టూ ఎవరూ లేకపోవడంతో ఫాంహౌస్‌లో గది తలుపు తట్టారు. దీంతో రాజశేఖర్ బయటకు రాగానే తలపై కర్రలు, రాడ్లతో దాడి చేసి, గాయపరిచారు. అనంతరం ఆమిదాలకుంట, వెంకటాంపల్లి మీదుగా వెంకటగిరిపాలెంకు తీసుకెళ్లి అక్కడ రాధికతో చెప్పుతో కొట్టించారు. అనంతరం కొట్టుకొంటూ తీసుకెళ్లి ఫాంహౌస్ వద్ద పడేసి వెళ్లిపోయారు. దెబ్బలకు తాళలేక కాసేపటికి రాజశేఖర్ మృతిచెందాడు. పక్కా ఆధారాలు లభ్యం కావడంతో రవీంద్రారెడ్డి, రాధిక, సాయినాథ్ కుమార్‌రెడ్డి (కానిస్టేబుల్), అనిల్‌కుమార్ రెడ్డి, వెంకటేష్, నరేష్‌ను మధ్యాహ్నం 2 గంటలకు మరకుంటపల్లి క్రాస్ వద్ద పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుంచి కర్రలు, ఇనుపరాడ్లు, స్విఫ్ట్ డిజైనర్ కారు స్వాధీనం చేసుకుని, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

చట్ట పరిధిలో న్యాయం చేస్తాం

- బాధితులకు ఎస్పీ రత్న భరోసా


అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: ప్రజలు అందజేసే అర్జీలను పరిశీలించి, చట్టపరిధిలో ఉన్న వాటికి తక్షణమే పరిష్కారం చూపుతామని ఎస్పీ రత్న భరోసానిచ్చారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 35 వినతులు అందాయి. ఎస్పీ రత్న స్వయంగా వినతులు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్య తీవ్రత తెలుసుకుని పరిష్కారానికి చొరవ తీసుకోవాలంటూ సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, లీగల్ అడ్వైజర్ సాయినాథ్‌రెడ్డి, ఎస్‌బీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, ఎస్ఐ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

సూపర్‌లో అరుదైన శస్త్రచికిత్స


కోలుకుంటున్న సుజాతబాయిని చూపుతున్న జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర రావు, తదితరులు

అనంతపురం మెడికల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో న్యూరో సర్జరీ విభాగం ఓ అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేసింది. వివరాలను సోమవారం ఉదయం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి న్యూరో సర్జరీ విభాగాధిపతి డాక్టర్ భాస్కర్ వెల్లడించారు. శ్రీ సత్యసాయి జిల్లా బుక్కపట్నం మండలం గూనిపల్లికి చెందిన 30 ఏళ్ల వయసున్న సుజాతబాయి తలనొప్పితో బాధపడుతూ చూపు తగ్గిపోయింది. దీంతో చికిత్స కోసం తిరుపతి స్విమ్స్‌కు వెళ్లింది. అక్కడ పరీక్షించిన వైద్యులు సుజాతబాయికి పిట్యూటరీ ట్యూమర్ ఉందని నిర్ధారించారు. శస్త్రచికిత్సకు రూ.5 లక్షలు అవుతుందన్నారు. అయితే ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్న ఆమె అంత పెద్ద మొత్తాన్ని చెల్లించుకోలేక పోయింది. అయితే ఆరోగ్యశ్రీ పథకం అక్కడ లేకపోవడంతో స్వగ్రామానికి చేరుకున్న ఆమె అనంతరం అనంతపురం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చూపించుకుంది. పరీక్షించిన న్యూరో విభాగాధిపతి డాక్టర్ భాస్కర్ ఆమెను గత నెల 21న అడ్మిట్ చేయించుకున్నారు. చికిత్సలో భాగంగా ఈ నెల 12న ఆమె స్కల్ ఓపెన్ చేయకుండా ముక్కు ద్వారా ఎండోస్కోపీ (మినిమల్లీ ఇన్వాసివ్ బ్రెయిన్ సర్జరీ) విధానంలో ట్యూమర్‌ను పూర్తిగా తొలగించారు. సర్జరీ ద్వారా కోలుకోవడానికి 15 నుంచి 20 రోజుల సమయం పట్టింది. ప్రస్తుతం ఆమె కంటి చూపు మెరుగుపడుతోంది. సర్జరీలో అనస్తీషియా వైద్యులు డాక్టర్ సుబ్రహ్మణ్యం బృందం, స్టాఫ్‌నర్సు అనిత తదితరులు పాల్గొన్నారు. సర్జరీని విజయవంతం చేసిన న్యూరో సర్జరీ విభాగాధిపతి డాక్టర్ భాస్కర్ బృందాన్ని ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్ అభినందించారు.

అంతర్రాష్ట్ర ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్


నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

అనంతపురం: ద్విచక్ర వాహనాలను అపహరించుకెళ్లే అంతర్రాష్ట్ర దొంగను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను అనంతపురం రెండో పట్టణ సీఐ శ్రీకాంత్ వెల్లడించారు. అనంతపురంలోని విద్యుత్ నగర్ సర్కిల్‌లో సోమవారం మధ్యాహ్నం ఎస్ఐలు రుష్యేంద్రబాబు, గౌస్‌పీర్, సిబ్బంది వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా ద్విచక్ర వాహనంపై వచ్చిన యువకుడు పోలీసులను చూడగానే ద్విచక్రవాహనాన్ని వెనక్కు తిప్పుకుని వేగంగా ఉడాయించాడు. దీంతో అనుమానం వచ్చిన పోలీసులు వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో కర్ణాటకలోని చెలికెర జిల్లా చిత్రదుర్గానికి చెందిన అంజనమ్మ కుమారుడు జితేంద్ర, అలియాస్ మరాఠీ జితేంద్ర ఉరఫ్ సిద్ధుగా నిర్ధారణ అయింది. కొంతకాలంగా బీకేఎస్ మండలం కేవీఎస్ నగర్‌లో నివాసముంటున్నాడు. నగరంలోని ఎస్వీ థియేటర్ వద్ద హోండా షైన్ బైక్, ఆర్టీసీ బస్టాండు ఆవరణలో స్ప్లెండర్ ప్లస్ బైక్, ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో హోండా యాక్టివ్ బైక్, ప్రకాష్ రోడ్డు పోలీస్ క్వార్టర్స్‌లో హోండా యాక్టివా స్కూటీని అపహరించినట్లు అంగీకరించాడు. ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ సమీపంలోని కంప చెట్లలో దాచిపెట్టిన వాహనాలను చూసేందుకు వెళుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. నిందితుడి నుంచి వాహనాలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. కాగా, స్వాధీనం చేసుకున్న నాలుగు వాహనాల విలువ రూ.3.50 లక్షలు ఉంటుందని అంచనా వేశారు.

క్రీడలతో విద్యాచైతన్యం

- ఎస్కేయూ వీసీ అనిత


మాట్లాడుతున్న ఎస్కేయూ వీసీ అనిత

అనంతపురం ఎడ్యుకేషన్: క్రీడలతో విద్యాచైతన్యం వెల్లివిరుస్తుందని ఎస్కేయూ ఇన్‌చార్జ్ వైస్‌చాన్సలర్ బి.అనితగౌడ్ అన్నారు. స్థానిక ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో అంతర్ డిగ్రీ కళాశాలల క్రికెట్ టోర్నీని సోమవారం ఆమె ప్రారంభించి, మాట్లాడారు. గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. క్రీడలు శారీరక, మానసిక ఎదుగుదలకే కాకుండా చదువుల్లోనూ రాణించేందుకు దోహదపడతాయన్నారు. ఎస్కేయూ క్రీడా విభాగం కార్యదర్శి జెస్సీ మాట్లాడుతూ క్రీడల్లో విద్యార్థులు, యువత ఉత్సాహంగా పాల్గొనాలన్నారు. కళాశాల చైర్మన్ డాక్టర్ సి.సోమశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ క్రికెట్ పోటీలు ఆర్డీటీ మైదానంలో ఈ నెల 21వ తేదీ వరకూ జరుగుతాయన్నారు. ఎస్కేయూ పరిధిలోని డిగ్రీ కళాశాలల విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్వీ కళాశాల వైస్‌చైర్మన్ సి.చక్రధరరెడ్డి, ప్రిన్సిపాల్ ఎస్‌వీ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ టి.శ్రీనివాసులు, ఏఓ శ్రీనాథ్ భట్, ఆర్గనైజింగ్ డైరెక్టర్ ఎం. శ్రీనివాసులునాయక్, వివిధ కళాశాలల పీడీలు పాల్గొన్నారు.

18 నుంచి వినియోగదారుల హక్కుల వారోత్సవాలు

పుట్టపర్తి టౌన్: జాతీయ వినియోగహక్కుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకూ జిల్లా వ్యాప్తంగా వారోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్ తెలిపారు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వినియోగదారుల హక్కుల రక్షణ, బాధ్యతలపై జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు ఉంటాయి. పాఠశాల, కళాశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నారు. గెలుపొందిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నారు.

నేత్రదానంతో ఇద్దరికి చూపు


నేత్రాలను అందిస్తున్న మృతుడి కుటుంబసభ్యులు

హిందూపురం: స్థానిక సత్యనారాయణపేటకు చెందిన పోస్టల్ ఏజెంట్ రామ్మోహన్ తండ్రి కోనయ్య(90) ఆదివారం మృతి చెందారు. దీంతో ఆయన నేత్రాలను దానం చేయడం ద్వారా మరో ఇద్దరికి కంటి చూపును ప్రసాదించాలని కుటుంబసభ్యులు నిర్ణయించుకున్నారు. విషయం తెలుసుకున్న మధుగిరిలోని వరదాయిని నేత్ర సంగ్రహణ కేంద్రం నుంచి నిపుణులు గాయత్రి, నారాయణ వచ్చి మృతుడి నేత్రాలను సేకరించి, బెంగళూరులోని డాక్టర్ రాజ్‌కుమార్ నేత్ర నిధికి పంపారు. కార్యక్రమంలో హిందూపురం జయంతి బృందం పాల్గొన్నారు.

మైనర్లను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు

పుట్టపర్తి టౌన్: జిల్లా వ్యాప్తంగా మోటార్ మెకానిక్, గుజిరీ, కిరాణా షాపుల్లో మైనర్ బాలురను పనిలో పెట్టుకుంటే చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ఆపరేషన్ స్వేచ్ఛ కార్యక్రమంలో భాగంగా ఎస్పీ రత్న ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు, మహిళా పోలీసులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు సంయుక్తంగా చేపట్టిన తనిఖీలు చేపట్టి పని ప్రాంతంలో ఉన్న 14 ఏళ్లలోపు బాలురుకు విముక్తి కలిగించారు. అనంతరం తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు.

రష్యా- ఉక్రెయిన్ యుద్ధం ఆగాలని యజ్ఞం


హరిహర క్షేత్రంలో యజ్ఞం చేస్తున్న రష్యన్లు

పుట్టపర్తి రూరల్: రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ఆగి..ప్రపంచ శాంతి నెలకొనాలని ఆకాంక్షిస్తూ రష్యాకు చెందిన సత్యసాయి భక్తులు సోమవారం పుట్టపర్తి సమీపాన ఎనుములపల్లిలోని హరిహర క్షేత్రంలో యజ్ఞం నిర్వహించారు. ఈ యుద్ధం వల్ల ప్రాణ, ఆస్తి నష్టం భారీస్థాయిలో జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పొరుగు దేశాలకు వలస వెళుతున్నారని రష్యాకు చెందిన జ్యోతి, లిలియా చెప్పారు. ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ భగవాన్ సత్యసాయి చేసిన బోధనలకు ఆకర్షితులమై 2005లో తాము పుట్టపర్తికి విచ్చేశామన్నారు. ప్రపంచ శాంతికి, మానవాళి సుఖశాంతులకు యజ్ఞ యాగాదులు దోహదపడతాయన్న అపార విశ్వాసంతో యజ్ఞం నిర్వహిస్తున్నామన్నారు. ప్రధాన రుత్వికులు సూర్యనారాయణ, వంశీకృష్ణ బాబుతో కలిసి 11 మంది వేదపండితులు హోమాన్ని, శ్రీదేవి,భూదేవి సహిత శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ ధర్మకర్త శ్రీరాములు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్న ప్రసాదాలు అందజేశారు.

వైభవంగా పూల రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

అమరాపురం: మండలంలోని హేమావతిలో వెలసిన సిద్దేశ్వరస్వామి పూల రథోత్సవాన్ని ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. రాత్రి 11 గంటలకు స్వామి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం డప్పు వాయిద్యాలతో ఆలయం నుంచి తీసుకువచ్చి పూల రథంపై అధిష్ఠింపజేశారు. భక్తుల హర నామస్మరణ మధ్య ఆలయం నుంచి గొల్లమారనహళ్లి రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయం వరకు లాగారు. సోమవారం వేకువజామున బొరుగులను రాశిగా పోసి పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నృత్యాలతో యువత ఆకట్టుకుంది.

నేడు పూల పల్లకీ ఉత్సవం

మడకశిర రూరల్: మండలంలోని భక్తరపల్లి లక్ష్మీనరసింహస్వామి, జిల్లెడుగుంట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి పూలపల్లకీ, తలనీలాలు, ముత్యాల గరుడోత్సవం నిర్వహించనున్నారు. ఈ మేరకు దేవాదాయ శాఖ, రథోత్సవ కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు.

పెన్షన్‌దారులకు అండగా ఉంటాం : డీఆర్‌ఎం



మాట్లాడుతున్న డీఆర్‌ఎం విజయ్‌కుమార్

గుంతకల్లు: పెన్షన్‌దారుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి వారికి అండగా ఉంటామని డీఆర్‌ఎం విజయ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో ఏర్పాటు చేసిన పెన్షన్ ఆదాలత్ కార్యక్రమానికి ఏడీఆర్‌ఎం సుధాకర్, సీనియర్ డీపీఓ క్యాప్రిల్ ఆరోరాతో పాటు హాజరైన డీఆర్‌ఎం మాట్లాడారు. అనంతరం పలువురు సీనియర్ పెన్షన్‌దారులను ఘనంగా సన్మానించారు. సమస్యలపై పెన్షన్‌దారులు అందజేసిన అర్జీలను పరిశీలించి, అక్కడికక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ ఆఫ్ రైల్వే (పీఎన్‌ఆర్) అధ్యక్షుడు పీవీవీ ప్రసాద్‌రావు, ఆల్ ఇండియా రిటైర్డు రైల్వేమెన్స్ ఫెడరేషన్ గుంతకల్లు డివిజన్ ప్రధాన కార్యదర్శి వి.సుంకప్ప, పెన్షనర్లు పాల్గొన్నారు.



దశావతారాలను ప్రదర్శిస్తున్న చిన్నారులు

సాయి చెంత... కృష్ణా భక్తుల పులకింత


మహానగర సంకీర్తనను ప్రారంభిస్తున్న ఆర్.జె.రత్నాకర్‌రాజు

పుట్టపర్తి రూరల్: పర్తి యాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన దాదాపు 3 వేల మంది కృష్ణా జిల్లా భక్తులు సత్యసాయి మహాసమాధి చెంత ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పులకించి పోయారు. మహానగర సంకీర్తనలో భాగంగా పల్లకీ ఉత్సవాలు, రథోత్సవాలు నిర్వహించారు. ఆయా ఉత్సవాల్లో చిన్నారులు విశేష అలంకరణలు, సాంస్కృతిక ప్రదర్శనలు, కోలాటలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమాల్లో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్‌రాజు పాల్గొన్నారు.


కోలాటంతో ఆకట్టుకున్న చిన్నారులు


నందగోపాలం నృత్య రూపకాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు